బంధం.. బహుదూరం!

ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ





బస్సులో సీటు కోసం పోటాపోటీ



కరుణగిరి బ్రిడ్జి సమీపాన ఇరువైలా బారులుదీరిన వాహనాలు

రాఖీ పండుగ శనివారం.. మరుసటి రోజు ఆదివారం.. ఇంకేముంది అక్కాచెల్లెళ్లు అన్నాతమ్ముళ్ల వద్దకు బయలుదేరారు. వీరికి తోడు విద్యాసంస్థల నుంచి పిల్లలను తీసుకెళ్తున్న తల్లిదండ్రులతో జిల్లా కేంద్రంలోని రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఖమ్మం కొత్త, పాత బస్టాండ్లలో అడుగు పెట్టే స్థలం లేకపోగా వచ్చిన బస్సు వచ్చినట్లే నిండసాగింది. ఇక ప్రైవేట్ వాహనాల రద్దీ కూడా అదే స్థాయిలో కనిపించింది. ఖమ్మం రాపర్తినగర్ మొదలు కరుణగిరి బ్రిడ్జి మీదుగా నాయుడు పేట క్రాస్ వరకు రెండు వైపులా గంటల తరబడి వాహనాలు నిలవడం ప్రయాణికుల సహనానికి పరీక్షలా మారింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి పాదానికి, శ్రీస్వామివారి విగ్రహానికి వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీవారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను అలంకరించి నిత్య కల్యాణం జరిపించగా.. భక్తులు కనులపండువగా తిలకించారు. శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరి జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి: సీపీ



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం : నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీపీ సునీల్‌దత్ సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సీసీ కెమెరాల విస్తరణ, నిబంధనలు అతిక్రమించే వాహనదారుల నుంచి జరిమానాల వసూలు తదితర అంశాలపై చర్చించారు. మునిపల్ కార్పొరేషన్ అధికారుల సమన్వయంతో సరైన పార్కింగ్ స్థలాలు గుర్తించాలని సూచించారు. ఖమ్మంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అరికట్టడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీపీ వెంట ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ సత్యనారాయణ, ఆర్‌ఐ సాంబశివరావు, ఎస్‌ఐ సాగర్ ఉన్నారు.

జిల్లాకు చేరిన బ్యాలెట్ బాక్స్‌లు



జిల్లాకు వచ్చిన బ్యాలెట్ బాక్స్‌లు

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నాలుగు రోజుల క్రితం గుజరాత్ నుంచి 2,300 బ్యాలెట్ బాక్స్‌లను కేటాయించింది. ఈ క్రమంలో శనివారం రెండు కంటైనర్లలో వాటిని తీసుకొచ్చి జిల్లా పరిషత్ ఆవరణలోని గోడౌన్‌లో భద్రపర్చినట్లు అధికారులు తెలిపారు.

సెప్టెంబర్ 3న దివ్యాంగుల మహాగర్జన



మందా కృష్ణను సత్కరిస్తున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేలు, పూర్తి వైకల్యం చెందిన వారికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిందని, 20 నెలలైనా హామీలు అమలు చేయడం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో దివ్యాంగుల మహాగర్జన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభను విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు మంద కృష్ణను సత్కరించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బాణోతు విజయ్, సాలి శివ, జొన్నలగడ్డ నరేష్, మట్టా ప్రసాద్, లక్ష్మీనారాయణ, సాధు జానికీరాం పాల్గొన్నారు.

నాడు కంపు.. నేడు ఇంపు



డంపింగ్‌యార్డ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు (ఫైల్)

దానవాయిగూడెం డంపింగ్ యార్డుకు కొత్తరూపం

- బయోమైనింగ్‌తో పదెకరాల స్థలం శుభ్రం
- 8 ఎకరాల్లో 8 వేలకు పైగా మొక్కల పెంపకం
- ఆహ్లాదకరంగా మారిన డంపింగ్‌యార్డ్ స్థలం



డంపింగ్‌యార్డ్‌లో మొక్కలు

ఖమ్మంమయూరిసెంటర్: వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలతో నిండి, దుర్వాసనతో పరిసర ప్రాంత ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన ఖమ్మం నగరంలోని దానవాయిగూడెం డంపింగ్ యార్డు ఇప్పుడు సరికొత్తగా మారింది. అధికారుల పట్టుదల, ప్రణాళికాయుతమైన కృషి ఫలితంగా ఈ డంపింగ్ యార్డు నేడు ఆహ్లాదకరమైన పచ్చని వనంగా రూపుదిద్దుకుంది. 'చెత్త పోయి.. మొక్కలు వచ్చె' అనే నానుడిని నిజం చేస్తూ ఈ ప్రదేశం స్థానికులకు ఆదర్శంగా నిలుస్తోంది. దానవాయిగూడెం డంపింగ్ యార్డు అంటేనే ఒకప్పుడు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. నగరంలోని ఘన వ్యర్థాలన్నీ ఇక్కడికే చేరడంతో నిత్యం కంపు కొడుతూ, పర్యావరణానికి విఘాతం కలిగించేది. దుర్వాసన మాత్రమే కాదు.. దోమలు, ఈగలు వృద్ధి చెందడానికి, భూగర్భ జలాలు కలుషితం కావడానికీ ఇది ఒక ముఖ్య కారణంగా స్థానికులు భావించారు. ఇక నెలలో రెండు, మూడుసార్లు డంపింగ్‌యార్డ్‌లో చెలరేగే మంటలు, పొగతో చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన పాలకవర్గం, అధికారులు డంపింగ్ యార్డును పునరుద్ధరించాలని సంకల్పించారు.

వేల మొక్కలతో పచ్చదనం..

దానవాయిగూడెం డంపింగ్‌యార్డ్‌లో శుభ్రం చేసిన స్థలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఇప్పటి వరకు 8 ఎకరాల్లో 8 వేలకు పైగా మొక్కలు నాటగా.. మరో రెండు వేల మొక్కలు నాటేందుకు దశల వారీగా కార్యక్రమం చేపట్టారు. ఇక్కడ పచ్చదనాన్ని పెంచడం ద్వారా వాతావరణాన్ని మెరుగుపరచడమే కాకుండా, డంపింగ్ యార్డుకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, క్రమం తప్పకుండా మొక్కలకు నీరందేలా పర్యవేక్షిస్తున్నారు. ఈ కృషి ఫలితంగా నగరంలోని దానవాయిగూడెం డంపింగ్ యార్డు ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతోంది. ఒకప్పుడు చెత్తకుప్పల దిబ్బగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు పక్షుల కిలకిలారావాలతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో నిండిపోయింది. ఈ మార్పు కేవలం పర్యావరణానికే కాదు.. పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి, జీవన నాణ్యతకు కూడా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అధికారులు చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం దేశంలోని ఇతర నగరాలకూ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అంటున్నారు. కాగా, తమ సమస్యలు తీరాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బయోమైనింగ్‌తో స్థలం శుభ్రం..

డంపింగ్ యార్డ్‌లో దశాబ్దాలుగా పేరుకుపోయిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించే కార్యక్రమం చేపట్టారు. 2023 జనవరి నాటికి ఇక్కడ 2.75 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకపోయినట్లు అధికారులు అంచనా వేశారు. 32 ఎకరాల్లో 20 ఎకరాల స్థలాన్ని శుభ్రం చేసే లక్ష్యంతో బయోమైనింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2023 జనవరిలో ఈ ప్రక్రియ ప్రారంభించగా.. ఆధునిక యంత్రాలతో వ్యర్థాలను వేరుచేసి, బయోమైనింగ్ ప్రక్రియతో పునర్వినియోగం చేయగల వాటిని రీసైక్లింగ్ యూనిట్లకు తరలించారు. మిగిలిన వ్యర్థాలను సురక్షితంగా డంప్ చేసే ప్రక్రియ పూర్తి చేశారు. పదెకరాలు శుభ్రం చేసేందుకు రెండున్నరేళ్ల సమయం పట్టగా ఈ స్థలాన్ని బయోమైనింగ్ నిర్వాహకులు కేఎంసీ అధికారులకు అప్పగించారు.

అనురాగానికి ప్రతీక..

సోదర బంధానికి ప్రతీక అయిన రాఖీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పుట్టింటికి వెళ్లి సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు పంపిణీ చేశారు. కాగా, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తన క్యాంప్ కార్యాలయంలో పలువురు మహిళలు, మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి సోదర భావం చాటుకున్నారు.



పొంగులేటికి రాఖీ కట్టిన మహిళా పోలీసులు

ఘనంగా హయగ్రీవ జయంతి

- వేడుకగా ముగిసిన పవిత్రోత్సవాలు
- నేటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం



హయగ్రీవునికి హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శనివారం హయగ్రీవుని జయంతి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న హయగ్రీవుని ఉపాలయంలో పండితులు వేదమంత్రాలు, భక్తజనాల శ్రీరామస్మరణల నడుమ హయగ్రీవునికి ఉదయం స్నపనం, తిరుమంజనం జరిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు విజయరాఘవన్ చేతుల మీదుగా చిన్నారులకు పలకలు, సామగ్రి అందజేశారు. పవిత్రోత్సవాల ముగింపు నేపథ్యంలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. కుంభప్రోక్షణ, పవిత్రావరోపణాలతో ఉత్సవ స్వస్తి పలికారు. పవిత్రోత్సవాల సందర్భంగా నిలిపివేసిన నిత్యకల్యాణాలు ఆదివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి.

సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం

- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాంట్ల ఏర్పాటు
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



వీసీపాల్గొన్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ఆయన సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచే పంపిస్తామని తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్ కు పంపవచ్చని సూచించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఖమ్మం కలెక్టరేట్‌లో పార్కింగ్ షెడ్‌లు సోలార్ ప్యానెళ్లతో నిర్మించామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇరిగేషన్ భూములు, దేవాదాయ భూముల వివరాలు సమర్పించనున్నట్లు వివరించారు. సమీక్షలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, ఏడీఈ నాగమల్లేశ్వర రావు, రెడ్కో జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు మార్గదర్శకాలు విడుదల

జిల్లాలో 2.09 లక్షల మంది అర్హులు

ఖమ్మంవ్యవసాయం: రైతు బీమా పథకానికి సంబంధించి 2025 సంవత్సరానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలో ఈ పథకానికి మొత్తం 2,09,387 మంది రైతులు అర్హులుగా వ్యవసాయ శాఖ గుర్తించింది. వీరిలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారు 10,494 మంది కాగా, ఐదెకరాల లోపు భూమి ఉన్న పాత పట్టాదారులు 2,992 మంది, ఐదెకరాలకు పైగా పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన వారు 305 మంది, రెన్యూవల్ అయినవారు 1,95,596 మంది ఉన్నారు. జిల్లాలో నూతనంగా 13,791 మంది రైతులు బీమా పథకంలో చేరేందుకు అర్హత కలిగి ఉన్నారు. వారు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఈనెల 13 లోగా బీమా పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా పేరు నమోదు చేసుకునే వారు రైతు బీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం/ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు సమర్పించాలని వివరించారు.

మార్గదర్శకాలు ఇలా..

రైతు బీమా పథకం 8వ సంవత్సర పాలసీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. వివరాలిలా ఉన్నాయి..

- 2025 జూన్ 5లోపు భూభారతి పోర్టల్ ద్వారా ధ్రువీకరించిన నూతన పట్టాదారు పాస్‌బుక్/ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా పొంది ఉండాలి
- రైతు వయసు ఆధార్‌కార్డును అనుసరించి 18 – 59 సంవత్సరాల మధ్య ఉండాలి
- 1966 ఆగస్టు 14 – 2007 ఆగస్టు 14 మధ్య జన్మించి ఉండాలి
- రైతు వయసు ఆధార్ కార్డు(యూఐడీఏఐ ఎల్ పోర్టల్)) అనుసరించి మాత్రమే తీసుకుంటారు.

సమాచారం అడిగే హక్కు అందరికీ ఉంది

స.హ. చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్

ఖమ్మం సహకారనగర్ : సమాచారం అనేది వజ్రాయుధమని, అవసరమైన సమాచారాన్ని సేకరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి. శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన స.హ.చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాచార హక్కును దుర్వినియోగం చేయొద్దని, దీన్ని అడ్డుపెట్టుకుని కొందరు ప్రలోభాలకు గురిచేస్తూ అడ్డదారులు ఎంచుకోవడం సరైంది కాదని హెచ్చరించారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం–2005కు అనుగుణంగా కోరిన వారికి సకాలంలో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అప్పిలేట్ అధికారిపై ఉంటుందని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు కంభంపాటి నారాయణరావు, జగదీష్, న్యాయవాది తిరుమలరావు, ప్రముఖ వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ సుబ్బారావు, శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా కార్యదర్శి చిర్రా రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీఐ కమిషనర్ పి.వి. శ్రీనివాస్

అనురాగంలో విషాదం..

సోదరులకు రాఖీ కట్టేందుకు వచ్చిన మహిళ గుండెపోటుతో మృతి

మధిర/తల్లాడ : సోదరులకు రాఖీ కట్టేందుకు వచ్చిన మహిళ గుండెపోటుతో మృతి చెందిన ఘటన తల్లాడ మండలం కలకొడిమలో చోటు చేసుకుంది. మధిర మండలం ఆత్కూరుకు చెందిన హుస్సేన్ బీ(50), భర్త హుస్సేన్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ప్రతీ ఏడాది రాఖీ పౌర్ణమి రోజున హుస్సేన్ బీ కలకొడిమలోని పుట్టింటికి వెళ్లి తన సోదరులకు రాఖీ కట్టేది. ఈ క్రమంలో శనివారం కూడా సోదరులకు రాఖీలు కట్టేందుకు సంతోషంగా వెళ్లింది. ఒక సోదరుడికి రాఖీ కట్టి, రెండో సోదరుడి ఇంటికి వెళుతుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయింది. ఆమెను ఆస్పత్రికి తీసుకెళుతుండగా మధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ రోజే హుస్సేన్ బీ తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో రెండు గ్రామాల్లో విషాదచాయలు అలముకున్నాయి.

క్లుప్తంగా

గిరిజన ఆశ్రమ హాస్టల్ బాత్‌రూమ్‌లకు డోర్లు



బాత్‌రూమ్‌లకు ఏర్పాటు చేసిన డోర్లు

సాక్షి ఎఫెక్ట్..

కల్లూరు: కల్లూరు ఎన్నెస్పీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 93 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరైన సౌకర్యాలు లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో 'ఎవరికీ పట్టని సంక్షేమం' శీర్షికన ఈనెల 7న సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏటీడీఓ భారతీదేవి ఆధ్వర్యంలో బాత్‌రూమ్‌లకు డోర్లు అమర్చగా.. విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

దొంగల హల్‌చల్

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేసినట్లు తెలిసింది. ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి చేతిలో ఇనుపరాడ్లతో గ్రామంలో తిరిగారు. ఒక ఇంటి యజమాని తాళంవేసి ఊరు వెళ్లగా తాళం పగులగొట్టి చోరీకి యత్నించారు. అక్కడ ఎమీ లభించకపోవడంతో గోడ దూకి పారిపోయినట్లు సీసీ కెమెరాల్లో రికార్డులను బట్టి గుర్తించారు. ఈ విషయంపై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా హల్‌చల్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



గోపీకిరణ్ (ఫైల్)

వేంసూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రామన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కొత్తపల్లి గోపీకిరణ్(20) భీరపల్లి శివారున ఉన్న పెట్రోల్ బంక్‌లో నుంచి ప్రధాన రహదారిపైకి వస్తుండగా మొద్దులగూడెం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన గోపీకిరణ్‌ను చికిత్స నిమిత్తం సత్తుపల్లికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని : మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి శ్రీలం సుదర్శన్‌రావు, అతడి కుమారుడు చైతన్యపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్ మీరా తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సుదర్శన్‌రావు కుటుంబసభ్యులకు సంబంధించిన భూ వివాదంపై ఈనెల 6న తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. గ్రామానికి చెందిన మాలెంపు కోటేశ్వరరావు, వారి కుటుంబసభ్యులు ఈ వివాదంలో జోక్యం చేసుకోగా ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సుదర్శన్‌రావు, అతడి కుమారుడిపై దాడి చేసిన ఘటనలో కోటేశ్వరరావుతో పాటు విజయ, పద్మావతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని దానవాయిగూడెంలో అత్తమామలపై అల్లుడు దాడి చేసిన ఘటనపై శనివారం ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం కామంచికల్‌కు చెందిన చిట్టిబాబు దానవాయిగూడేనికి చెందిన సౌజన్యను పెళ్లి చేసుకున్నాడు. శనివారం భార్యను తీసుకెళ్లడానికి రాగా, ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో భార్యపై ఇనుపచువ్వతో దాడికి ప్రయత్నం చేశాడు. దీంతో అడ్డుకోబోయిన అత్త, మామ కూడా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు.

గంజాయి స్వాధీనం

మణుగూరు టౌన్: ఒడిశా నుంచి వరంగల్‌కు తరలిస్తున్న గంజాయిని శనివారం మణుగూరు పోలీసులు పట్టుకున్నారు. సీఐ పాటి నాగబాబు కథనం ప్రకారం.. ఎస్‌ఐ రంజిత్, సిబ్బందితో కలిసి తోగ్గూడెం శివారు ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి తనిఖీ చేయగా 32 కేజీల గంజాయి లభించింది. విచారించగా అల్లూరి సీతారామరాజు జిల్లా పెద్దపాక మండలం కుసున్నపల్లి గ్రామానికి చెందిన తోడెం శ్రీను, మహబూబాద్ జిల్లా బోడగుట్ట తండా గ్రామానికి చెందిన బానోత్ కుమార్ ఆటోలో గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. గంజాయి విలువ రూ.16 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

దుమ్ముగూడెం: మండలంలోని తురుబాక గ్రామానికి చెందిన యువకుడు, బూర్గంపాడు మండలానికి చెందిన యువతి ప్రేమ వివాహం చేసుకుని రక్షణ కోసం శనివారం దుమ్ముగూడెం పోలీసులను ఆశ్రయించారు. కొంత కాలంగా ప్రేమించుకుంటున్న వీరి వివాహానికి యువతి తల్లితండ్రులు ఒప్పుకోకపోవడంతో ప్రేమజంట రహస్యంగా వివాహం చేసుకుంది. రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు ఇరు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరు మేజర్లు కావడంతో వివాహం చేసుకున్నారని నచ్చజెప్పారు.

'ఇల్‌నెస్' సెంటర్..!

వెల్‌నెస్ సెంటర్‌పై పట్టింపు కరువు

- వేధిస్తున్న మందుల కొరత
- నామమాత్రపు ఔషధాలతోనే నెట్టుకొస్తున్న వైనం
- ఇబ్బంది పడుతున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు



పెద్దాసుపత్రిలోని వెల్‌నెస్ సెంటర్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ బాలారిష్టాలు ఎదుర్కొంటోంది. ఈ సెంటర్‌ను కొన్ని నెలలుగా మందుల కొరత వేధిస్తోంది. అవసరమైన మందులు దొరకక ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి పరిస్థితి దయనీయంగా మారింది. అవసరమైన మందులు దొరకక కొందరు ఆస్పత్రి చుట్టూ తిరుగుతుండగా, మరికొందరు ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఈ సెంటర్ కేవలం ఓపీ సేవలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రోజువారీ మాత్రలు కూడా లేక..

వెల్‌నెస్ సెంటర్‌కు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎక్కువగా వస్తుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో 40 ఏళ్ల దాటిన వారు ఎక్కువగా బీపీ బారిన పడుతున్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో దాదాపు 80 నుంచి 90 శాతం మంది రక్తపోటుతో బాధపడుతున్నారు. కొందరు బీపీతో పాటు షుగర్ మాత్రలు రోజూ వేసుకోవాల్సి వస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత గల మందులు వెల్‌నెస్ సెంటర్‌లో ఆరు నెలలుగా అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అప్పుడప్పుడు ట్రస్ట్ నుంచి మాత్రలు వస్తున్నా ఒకటి, రెండు రోజుల్లోనే అయిపోతున్నాయి.

తాకిడి ఉన్నా పట్టింపు కరువు..

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 200 మంది వెల్‌నెస్ సెంటర్‌కు వైద్య సేవల కోసం వస్తుంటారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, ఫిజియోథెరపీ, డెంటల్ తదితర సేవలు అందుతాయి. టెస్టులకు ల్యాబ్, ఫార్మసీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ, నరాల బలహీనత, జ్వరం, ఇతర సీజనల్ వ్యాధులకు చికిత్స చేస్తారు. అయితే ఇక్కడ బీ కాంప్లెక్స్, ఇన్సులిన్, థైరాయిడ్, గ్యాస్, జ్వరం, జలుబు, దగ్గు, అస్తమా రోగులకు ఇన్‌హెల్లర్లు అందుబాటులో లేవు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు మందులు దొరక్క నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సిబ్బంది కొరత, సౌకర్యాల లేమి..

ఉమ్మడి జిల్లా ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌లో సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూత్ర పరీక్షల శాంపిళ్లు తీసుకోవడానికి కనీసం బాత్‌రూమ్‌లు కూడా లేవు. దాని కోసం జనరల్ ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌ల్లోకి వెళ్లాల్సి వస్తోంది. ఓపీ, ఇతర విభాగాల్లో కుర్చీలు కూడా లేవు. గదుల్లో కిటికీలకు కర్టన్లు లేక పగటి పూటే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. సెంటర్‌లో సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. ముగ్గురు ఫార్మసిస్టులకు ఇద్దరు, నలుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇద్దరు, నలుగురు స్టాఫ్‌నర్సులకు ఇద్దరు, ముగ్గురు మెడికల్ ఆఫీసర్లకు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా పెషెంట్లకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. గైనిక్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ సేవలు అందుబాటులో లేక ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. బీపీ మిషన్ మరమ్మతులకు గురికాగా, పక్కన పెట్టారు. అలాగే 400 రకాల మందులు అందుబాటులో ఉండాల్సిన ఈ సెంటర్‌లో 150 రకాలు మాత్రమే ఉన్నాయి. సాధారణంగా వెల్‌నెస్ సెంటర్‌కు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి బ్రాండెడ్ మందులు సరఫరా అవుతాయి. ఒక్కో రోగి నెలకు సరిపడా మందులు తీసుకెళ్తుంటారు. అవి అందుబాటులో లేక ప్రైవేటు షాపుల్లో డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

మూడు నెలలుగా మందులు లేవు



మూడు నెలలుగా వెల్‌నెస్ సెంటర్ చుట్టూ తిరుగుతున్నా మందులు అందుబాటులో ఉండట్లేదు. ఎప్పుడు వస్తాయనే సమాచారం చెప్పే వారు కూడా లేరు. బీపీ, షుగర్, థైరాయిడ్‌తో ఇబ్బంది పడుతున్నా. ఈ సెంటర్‌తో ఉపయోగం లేకుండా పోయింది. – ఎ.జయలక్ష్మి, ఖమ్మం

మందుల కొరత వాస్తవమే



వెల్‌నెస్ సెంటర్‌లో మందుల కొరత వాస్తవమే. ట్రస్ట్‌కు ఇండెంట్ పెట్టాం. త్వరలో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ఉన్న మందులతో సేవలు అందిస్తున్నాం. రోగులకు సాధ్యమైనంత వరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. కొంత మేరకు సిబ్బంది కొరత ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సౌకర్యాలపై కూడా నివేదిక పంపించాం.

– డాక్టర్ నారాయణమూర్తి, వెల్‌నెస్ సెంటర్ జనరల్ ఫిజీషియన్

నాటక రంగానికి జీవం పోస్తున్నారు..

నెలనెలా వెన్నెల నిర్వాహకులకు తనికెళ్ల భరణి అభినందన



మాట్లాడుతున్న సినీ నటుడు తనికెళ్ల భరణి

ఖమ్మంగాంధీచౌక్: నాటక రంగం గొప్పదని, మారుతున్న కాలంలో ఆ రంగాన్ని ఆదరిస్తూ నెల నెలా వెన్నెల నిర్వాహకులు జీవం పోస్తున్నారని సినీ నటుడు, దర్శకుడు తనికెళ్ల భరణి అన్నారు. ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నెల నెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాటక రంగం తల్లి లాంటిదని అభివర్ణించారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న నాటిక పోటీలను చూస్తుంటే తన తల్లిగారింటికి వచ్చిన ఆనందం కలుగుతోందన్నారు. ప్రతీ నెల నాటికలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. నాటకాలకు ప్రసిద్ధిగా ఉన్న ఈ ప్రాంతంతో తెలియని అనుబంధం ఉందని చెప్పారు. సినీ దర్శకులు దశరథ్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా పేరును నలుదిశలా చాటుతున్న నెల నెలా వెన్నెల కార్యక్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మిత్ర ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, నెల నెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, మోటమర్రి జగన్మోహన్‌రావు, వేముల సదానందం, నామా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం సీనియర్ కళాకారుడు కన్నబోయిన అంజయ్యను తనికెళ్ల భరణి సత్కరించారు. కాగా, విజయవాడకు చెందిన న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన 'ఐ ఏట్ ఇండియా' నాటిక ప్రేక్షకులను అలరించింది.

యూరియా కోసం రైతుల రాస్తారోకో



కల్లూరురూరల్: తమకు సరిపడా యూరియా అందజేయాలని కోరుతూ కల్లూరు మండలం చెన్నూరు పీఏసీఎస్ ఎదుట రైతులు రాస్తారోకో చేపట్టారు. యూరియా అరకొరగా పంపిణీ చేస్తున్నారని, నెలకు ఒకసారి మాత్రమే ఇస్తుండడంతో పంటలకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఎస్సై హరిత ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎరువుల కోసం తమ కుటుంబాలు క్యూలైన్‌లో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. జిల్లాకు 7,500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 4,500 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో రైతులు, రైతు సంఘం నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, రావూరి వెంకటేశ్వరరావు, ఆళ్ల శ్రీకాంత్, దంతాల లక్ష్మయ్య, నల్లమాటి రామకృష్ణ, మాదాల భద్రయ్య, గింజుపల్లి అర్జున్‌రావు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో వక్తలు



కారేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

కారేపల్లి/సత్తుపల్లిరూరల్ : పోరాటాలతోనే ఆదివాసీల హక్కులు సాధ్యమవుతాయని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శనివారం కారేపల్లిలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు నేటికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, వైద్య అవకాశాలకు దూరంగా ఉన్నారని, పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబాటుకు గురవుతున్నారని ఆరోపించారు. ఆదివాసీ గూడేల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండడం లేదన్నారు. ప్రతి ఒక్కరు కొమం భీం స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆదివాసీలు సంప్రదాయ వేషధారణలో కొమరం భీం సెంటర్ నుంచి బస్టాండ్, సినిమాహాల్, అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గి కృష్ణ, బచ్చలి వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, ఈసం భాస్కర్, వీసాల రాంబాబు, యదళ్లపల్లి శ్రీనివాస్, వజ్జా రామారావు, వట్టం నాగేశ్వరరావు, శివరాం, జ్యోతి, రామారావు, సరోజిని, సత్యనారాయణ, స్వామి, పెంటయ్య పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం..

సత్తుపల్లిరూరల్ : ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు చేస్తూ వారిని అడవుల నుంచి తరిమివేస్తున్నాయని, వారి హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు అడవుల్లో స్వేచ్ఛగా జీవించిన ఆదివాసీలు ఇప్పుడు భయంభయంగా బతుకీడుస్తున్నారని అన్నారు. ఆదివాసీల సంరక్షణకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని నేటి పాలకులు గొప్పలు చెబుతున్నా.. విద్య, ఉద్యోగ, వైద్య రంగాల్లో నేటికీ వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అమర్లపూడి శరత్, ఎ.వెంకన్న, కాటేనేని శ్రీనివాసరావు, గంటా శ్రీను, కొర్సా వెంకటేష్, దుంపా రాఘవులు, ఆదాం సాహెబ్, మారుతి శ్రీను, పుచ్చ కృష్ణవేణి, కృష్ణ, అరుణ్‌కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో శనివారం రాఖీ పౌర్ణమి సందడి కనిపించింది. మండల పరిధిలోని కిన్నెరసానికి శనివారం జిల్లా నలు మూలల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. 383 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,855 ఆదాయం లభించింది. 150 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.6,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

లారీ – బొలేరో వాహనం ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బొలేరో వాహనం

తిరుమలాయపాలెం: బొలేరో వాహనం లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం తెల్లవారుజామున దమ్మాయిగూడెం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా దవళేశ్వరం నుంచి పూల మొక్కల లోడుతో నిర్మల్ వెళ్తున్న బొలేరోను వాహనం దమ్మాయిగూడెం సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే మరిపెడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో బొలేరో వాహనం డ్రైవర్ ఆకుల లోవరాజు, తోడుగా వచ్చిన బొడ్డుపల్లి ప్రదీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బురదలో దిగబడిన లారీ..

సీసీ రోడ్డు సగం వేసి వదిలేయడంతో ఘటన



దిగబడిపోయిన సిమెంట్ దిమ్మెల లోడ్ లారీ

కారేపల్లి: డోర్నకల్ జంక్షన్ నుంచి కారేపల్లి మీదుగా భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ వరకు నిర్వహించే డబ్లింగ్ రైల్వే లైన్ ప్రక్రియలో భాగంగా.. పనులు చేపట్టిన రైల్వే అధికారులు ముందస్తుగా రైల్వే ట్రాక్ సిమెంట్ దిమ్మెలను లారీల్లో ట్రాక్‌ల వెంట స్టోర్ చేస్తున్నారు. కాగా, శనివారం కారేపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే కేబిన్ వద్దకు సిమెంట్ దిమ్మెలను తీసుకొస్తున్న లారీ కారేపల్లి ముత్యాలమ్మగుడి, సంత, సింగరేణి ప్రాథమిక పాఠశాలల కూడలి మీదుగా వెళ్తుండగా దిగబడిపోయింది. టైర్లు మొత్తం బురదలో దిగబడడంతో లారీ పూర్తిగా ఓ పక్కకు వాలిపోయింది. ఇటీవల ముత్యాలమ్మగుడి నుంచి డోర్నకల్ బైపాస్ రోడ్డుకు కలిపేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అది సగం వరకు వచ్చి ఆగిపోవడం, మిగతా రోడ్డులో అప్పటికే మట్టిని తొలగించి ఉండడంతో వరద నీరు చేరింది. ఈ క్రమంలో లారీ దిగబడగా.. క్రేన్ సాయంతో సిమెంట్ దిమ్మెలను దింపి లారీని బయటకు తీశారు.

సింగరేణి 'ఫారెస్టు' అక్రమాల డొల్ల..

- భూపాలపల్లి ఏరియాలో అక్రమాలపై విచారణ పూర్తి
- కలప విక్రయాల్లో రూ.50 లక్షలకు పైగా తేడా
- ఇతర ఏరియాల్లోనూ విచారణకు పెరిగిన డిమాండ్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సామాజిక బాధ్యత, సంస్థ అవసరాల మేరకు పని చేయాల్సిన ఫారెస్టు విభాగంపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జామాయిల్ చెట్ల నరికివేత, అమ్మకాల విషయంలో కేవలం భూపాలపల్లి సంఘటనే వెలుగు చూసిందని, కానీ వెలుగులోకిరాని నిజాలెన్నో ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

కేవలం భూపాలపల్లి ఘటనపైనే విచారణ

సింగరేణి సంస్థ పరిధిలో 11 ఏరియాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో సింగరేణి సంస్థ భారీగా జామాయిల్ చెట్లను పెంచుతోంది. ఏపుగా పెరిగిన చెట్లను నరికి సంస్థ అవసరాల కోసం వినియోగిస్తోంది. చెట్లను నరకడంతో పాటు వాటిని దుంగలు/మొద్దులుగా మార్చి ఇవ్వాల్సిన పనిని ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. ఈ క్రమంలో భూపాలపల్లి ఏరియాలో 2018 నుంచి 2020 వరకు జరిగిన లావాదేవీల్లో రూ. 50 లక్షలకు పైగా పక్కదారి పట్టినట్లు సంస్థ విజిలెన్స్ విభాగం దృష్టికి వచ్చింది. దీంతో శాఖాపరమైన విచారణ చేపట్టి నివేదికను సిద్ధం చేశారు. అవకతవకలకు కారణమైన ఉద్యోగులు, అధికారులపై ఏ రకమైన చర్యలు తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

ఇతర ఏరియాల్లో విచారణ జరపాలి...

భూపాలపల్లి ఏరియాలో 2018 నుంచి 2020 మధ్య కాలంలో చోటుచేసుకున్న అక్రమాల కారణంగా సంస్థకు రూ. 50 లక్షలకు పైగా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్టుగా తేలింది. సంస్థ పరంగా ఫారెస్టు విభాగంలో పని చేసే అధికారుల మధ్య చోటు చేసుకున్న ఆధిపత్య పోరు చినికిచినికి గాలివానగా మారడంతో ఈ వ్యవహారం విజిల్ బ్లోయర్ ద్వారా విజిలెన్స్ దృష్టికి వచ్చింది. లేదంటే సంస్థకు రావాల్సిన రూ. 50 లక్షలకు పైగా సొమ్ము రాకుండా పోయేది. ఈ తరహా అవకతవకలు ఇతర ఏరియాల్లోనూ జరిగాయనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. దీంతో భూపాలపల్లి తరహాలోనే ఇతర ఏరియాల్లోనూ విచారణ జరపాలనే డిమాండ్లు వస్తున్నాయి. సంస్థ పరిధిలోని అన్ని ఏరియాల్లో కనీసం గడిచిన ఐదేళ్ల కాలంలో ఫారెస్టు విభాగంలో జరిగిన లావాదేవీలపై దృష్టి సారించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. కేవలం కర్ర అమ్మకాలే కాకుండా ఎంత విస్తీర్ణంలో కటింగ్ చేయాల్సి ఉండగా ఎంత ఏరియాలో చెట్లను నరికారనే అంశాలపై కూడా దృష్టి పెట్టాలంటున్నారు. దీంతో పాటు భవిష్యత్‌లో చెట్లు నరికే విషయంలో అవకతవకలు జరిగేందుకు వీలులేకుండా పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా కొత్త నిబంధనలు రూపొందించాలంటున్నారు.

పైస్థాయిలో అలా.. కింది స్థాయిలో ఇలా

సామాజిక బాధ్యతగా ఐదు కోట్లకు పైగా మొక్కలు నాటిన సంస్థగా సింగరేణి రికార్డు సాధించింది. 2019లో సంస్థలో డైరెక్టర్ పాగా బాధ్యతలు చేపట్టింది మొదలు ప్రస్తుతం సీఎండీ వరకు రికార్డు స్థాయిలో 20 వేలకు పైగా మొక్కలు స్వయంగా నాటారు. అఖిల భారత స్థాయి అధికారుల్లో ఫారెస్టు వారిని మించి మరీ ట్రీమ్యాన్‌గా గుర్తింపు పొందారు. మరోవైపు ఆ సంస్థ పరిధిలో ఉన్న ఫారెస్టు విభాగం అక్రమాలకు వేదికగా మారడం గమనార్హం.

అసలేం జరిగిందంటే..?

గనుల్లో బొగ్గును తీసిన తర్వాత ఏర్పడిన గుల్ల ప్రదేశంలో బొగ్గు పొరలు కూలి కిందపడకుండా సపోర్ట్‌గా ఐరన్ రాడ్స్, కలప దుంగలను పెడుతుంటారు. ఇందుకోసమే సింగరేణి సంస్థ వేలాది ఎకరాల్లో యూకలిప్టస్ చెట్లు పెంచుతోంది. జామాయిల్ చెట్టు మొదలు (ప్రోప్), మధ్య (చోక్) భాగాలు సపోర్టింగ్ పిల్లర్లుగా ఉపయోగపడతాయి. చెట్టుపై భాగంలో సన్నగా, పీలగా ఉండే కలప సపోర్టింగ్ పిల్లర్‌గా పనికి రాదు. కానీ పేపర్ పరిశ్రమలకు ఉపయోగపడుతుంది. వీటితో పేపర్ పల్ప్‌ను తయారు చేస్తారు. దీంతో నరికివేసిన చెట్ల నుంచి ప్రధాన అవసరమైన సపోర్టింగ్ పిల్లర్లకు సంబంధించిన కలపను సంస్థకు కాంట్రాక్టరు ముందుగా అప్పగించాలి. ఆ తర్వాత మిగులుగా తేలిన జామాయిల్ చెట్ల పై భాగానికి సంబంధించిన వివరాలను వెల్లడించాలి. అనంతరం వాటిని పేపర్ పరిశ్రమలకు అమ్మి, ఆ మేరకు కమీషన్ తీసుకుని మిగిలిన సొమ్మును సంస్థ ఖాతాలో జమ చేయాలి. భూపాలపల్లి ఏరియాలో మిగులు కర్రను కాంట్రాక్టరుకు అప్పగించారు. అయితే తిరిగి ఎంత సొమ్ము సంస్థఖాతాలో జమైంది అనే వివరాల్లో భారీ అంతరాలు చోటు చేసుకున్నట్టు ఫిర్యాదు అందింది.

క్లుప్తంగా

గిరిజన ఆశ్రమ హాస్టల్ బాత్‌రూమ్‌లకు డోర్లు


బాత్‌రూమ్‌లకు ఏర్పాటు చేసిన డోర్లు

సాక్షి ఎఫెక్ట్..

కల్లూరు: కల్లూరు ఎన్నెస్పీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 93 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరైన సౌకర్యాలు లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో 'ఎవరికీ పట్టని సంక్షేమం' శీర్షికన ఈనెల 7న సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏటీడీఓ భారతీదేవి ఆధ్వర్యంలో బాత్‌రూమ్‌లకు డోర్లు అమర్చగా.. విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మిత్రుడికి చేయూత..

తల్లాడ: అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి తోటి స్నేహితులు చేయూతనందించారు. మండలంలోని కుర్నవల్లిలో మోటార్ న్యూరాన్ వ్యాధితో బాధపడుతున్న శీలం కృష్ణారెడ్డి పరిస్థితి తెలుసుకున్న తనతో చదువుకున్న చిన్ననాటి మిత్రులు శనివారం రూ.50 వేలు నగదు సాయం అందజేశారు. ఈ మేరకు కృష్ణారెడ్డి గృహానికెళ్లి ఆయన్ని పరామర్శించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో అయిలూరి ప్రదీప్‌రెడ్డి, కొరకొప్పు రామరావు, దేవరపల్లి నరసింహారావు, శాఖంరెడ్డి పుల్లారెడ్డి, నర్సిరెడ్డి, సైదులు, ఎస్.కె.హుసేన్, టీవీకె.నాగచారి, వడ్డే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

మధిర: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ నాయకులు పాపట్ల రమేష్ కోరారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీహరి చౌదరి, శివరాజు సుమంత్, పెరుమాళ్లపల్లి విజయ రాజు, గుండా చంద్రశేఖర్ రెడ్డి, చిలువేరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

ఎర్రుపాలెం: బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో కేంద్ర వ్యవహిస్తున్న తీరుకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం మండలకేంద్రంలోని రింగ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యకర్తలు, నాయకులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ రావు , సగ్గుర్తి సంజీవరావు, దూదిగం బసవయ్య, కూడలి నాగేశ్వరరావు, గొర్రాజు రాములు, దివ్వెల వీరాంజనేయులు, నక్కా పుల్లారావు, నాగుల్‌మీరా, నండ్రు ప్రభుదాస్, బుడే సాహెబ్ ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

వైరా: యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం వైరాలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్ నేతృత్వంలో రింగ్‌రోడ్డు సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్ బైక్ ర్యాలీ ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాస్టాల క్రాంతికుమార్, నాయకులు రాచకొండ సాయికుమార్, మోరు శ్రీకాంత్, దేవళ్ల సాయి, వేముల శ్రీనాద్, షేక్ జాన్‌పాషా, బాలరాజు, కోటేశ్వరరావు, సాయి, నోయల్,చరణ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. ఎర్రుపాలెం, మధిర మండలాల యూత్ అధ్యక్షులు నండ్రు బాబురావు,పోచేపల్లి సురేష్, నాయకులు దేవరకొండ రాజీవ్ గాంధీ, కడియం శ్రీనివాసరావు, షేక్ ఇస్మాయిల్, గుడేటి బాబురావు, కంచర్ల వెంకటనర్సయ్య, తదితరులు ఉన్నారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో

కల్లూరురూరల్: తమకు సరిపడా యూరియా అందజేయాలని కోరుతూ కల్లూరు మండలం చెన్నూరు పీఏసీఎస్ ఎదుట రైతులు రాస్తారోకో చేపట్టారు. యూరియా అరకొరగా పంపిణీ చేస్తున్నారని, నెలకు ఒకసారి మాత్రమే ఇస్తుండడంతో పంటలకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఎస్సై హరిత ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎరువుల కోసం తమ కుటుంబాలు క్యూలైన్‌లో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. జిల్లాకు 7,500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 4,500 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో రైతులు, రైతు సంఘం నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, రావూరి వెంకటేశ్వరరావు, ఆళ్ల శ్రీకాంత్, దంతాల లక్ష్మయ్య, నల్లమోటి రామకృష్ణ, మాదాల భద్రయ్య, గింజుపల్లి అర్జున్‌రావు పాల్గొన్నారు.

అనుబంధానికి రక్షా..

ఘనంగా రాఖీ వేడుకలు

సోదరీ, సోదరుల బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెల్లు సొంతిళ్లకు వెళ్లి తమ సోదరులకు రాఖీలు కట్టారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని పెద్దవారి దగ్గర ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాఖీ సెంటర్లలో, స్వీట్ల దుకాణాల్లో సందడి నెలకొంది. ఈ మేరకు రహదారులన్నీ రద్దీగా మారాయి.

– సాక్షి నెట్‌వర్క్


కొణిజర్ల: అమ్మపాలెం జ్యోతిబాపూలే గురుకులంలో రాఖీలు కట్టుకుంటున్న బాలురు


సత్తుపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాఖీ కడుతున్న ఎమ్మెల్యే రాగమయి


కొణిజర్ల: రాజ్యాతండాలో..


తల్లాడలో..


సత్తుపల్లిరూరల్: తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క..


సత్తుపల్లిటౌన్: అన్నలకు రాఖీలు కడుతున్న చెల్లెలు


వైరా: మంత్రి పొంగులేటికి రాఖీ కడుతున్న వైరా మాజీ జెడ్పీటీసీ బొర్రా ఉమాదేవి


ఏన్కూరు: సోదరుడికి శుభాకాంక్షలు తెలుపుతూ..


కారేపల్లిలో..


బోనకల్‌లో..


చింతకాని: లచ్చగూడెంలో..


ముదిగొండ: కమలాపురంలో..


వైరారూరల్: తాటిపుడిలో..


కల్లూరులో..

సెల్ఫీ విత్ రాఖీకి అనూహ్య స్పందన

రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు ఆడపడుచులు పుట్టింటికి రావడంతో పల్లె, పట్టణాలు కళకళలాడాయి. కాగా, సాక్షి ఆధ్వర్యంలో సెల్ఫీ విత్ రాఖీ కార్యక్రమం చేపట్టగా అనూహ్య స్పందన లభించింది. అందులో ఎంపిక చేసిన ఫొటోలను ప్రచురిస్తున్నాం.


సత్తుపల్లిలో సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి


వైరాలో సాహిత్‌కు రాఖీ కడుతున్న నళిని


తల్లాడలో అన్నకు రాఖీ కడుతున్న శరణ్య


తల్లాడ మండలం బిల్లుపాడులో సోదరుడికి రాఖీ కడుతూ..


ముదిగొండ మండలం వనంవారి కృష్ణాపురంలో..


ఎర్రుపాలెంలో లికిత్‌రెడ్డికి రాఖీ కడుతున్న సాత్విక

ఆర్టీసీకి రాఖీ రద్దీ..

సత్తుపల్లిటౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ బస్సులకు రద్దీ పెరిగింది. ప్రయాణికుల రాకపోకలతో బస్సులన్నీ కిటకిటలాడాయి. మహిళల రద్దీగా విపరీతంగా ఉండటంతో రాత్రి నుంచి రాత్రి వరకు బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయ్యాయి. బస్సుల్లోకి ఎక్కాలంటే కాలుపెట్టే సందు కూడా లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోయారు.

32 అదనపు ట్రిప్పులతో..

విద్యాసంస్థలకు సెలవు ఉండటంతో స్కూల్ బస్సులు నడిచే రూట్లలో బస్సులను రద్దు చేసి ఖమ్మం, అశ్వారావుపేట రూట్లలో 9 బస్సులతో 32 అదనపు ట్రిప్పులు నడిపారు. డిపో కార్యాలయంలోని సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, వీబీఓలతో పాటుగా ట్రాఫిక్ నియంత్రణలో ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఉద్యోగులు నిమగ్నమయ్యారు. కండక్టర్లు, డ్రైవర్లకు, ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బందికి భోజనం ఏర్పాటు చేశారు. ఆదివారం సత్తుపల్లి డిపో నుంచి హైద్రాబాద్ సర్వీస్‌లన్నీ రిజర్వేషన్ ఫుల్ కావటంలో ఏడు అదనపు సర్వీస్‌లను నడుపుతున్నట్లు డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు.


సత్తుపల్లి టౌన్: సత్తుపల్లి బస్టాండ్‌లో..


కల్లూరురూరల్: కిక్కిరిసిన బస్సు

పోరాటాలతోనే హక్కుల సాధన

● ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో వక్తలు

కారేపల్లి: పోరాటాలతోనే ఆదివాసీల హక్కులు సాధ్యమవుతాయని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శనివారం కారేపల్లిలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు నేటికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, వైద్య అవకాశాలకు దూరంగా ఉన్నారని, పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబాటుకు గురవుతున్నారని ఆరోపించారు. ఆదివాసీ గూడేల్లో కనీస సౌకర్యాలు కూడా ఉండడం లేదన్నారు. ప్రతీ ఒక్కరు కొమరం భీం స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఆదివాసీలు సంప్రదాయ వేషధారణలో కొమరం భీం సెంటర్ నుంచి బస్టాండ్, సినిమాహాల్, అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుగ్గి కృష్ణ, బచ్చలి వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, ఈసం భాస్కర్, వీసాల రాంబాబు, యదళ్లపల్లి శ్రీనివాస్, వజ్జా రామారావు, వట్టం నాగేశ్వరరావు, శివరాం, జ్యోతి, రామారావు, సరోజిని, సత్యనారాయణ, స్వామి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం..

సత్తుపల్లిరూరల్ : ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు చేస్తూ వారిని అడవుల నుంచి తరిమివేస్తున్నాయని, వారి హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు అడవుల్లో స్వేచ్ఛగా జీవించిన ఆదివాసీలు ఇప్పుడు భయంభయంగా బతుకీడుస్తున్నారని అన్నారు. ఆదివాసీల సంరక్షణకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని నేటి పాలకులు గొప్పలు చెబుతున్నా.. విద్య, ఉద్యోగ, వైద్య రంగాల్లో నేటికీ వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమర్లపూడి శరత్, ఎ.వెంకన్న, కాటేనేని శ్రీనివాసరావు, గంటా శ్రీను, కొర్సా వెంకటేష్, దుంపా రాఘవులు, ఆదాం సాహెబ్, మారుతి శ్రీను, పుచ్చ కృష్ణవేణి, కృష్ణ, అరుణ్ కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.

15వ ప్రత్యేక బెటాలియన్‌లో..

సత్తుపల్లి మండలం గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ సహాయ కమాండెంట్ ఎస్‌డీ.రంగారెడ్డి ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సహాయ కమాండెంట్ ఎస్‌డి రంగారెడ్డి కోమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐలు, ఆర్ ఎస్ఐలు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


కారేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు


సత్తుపల్లిరూరల్: ఏకలవ్యుడి విగ్రహానికి నివాళి..

ఏన్కూరు: ఆదివాసీ దినోత్సవ వేడుకలు సందర్భంగా మండల కేంద్రంలో కొమరంభీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరెం వరలక్ష్మి, ఆరెం రామయ్య, ముక్తి వెంకటేశ్వర్లు, పూసం సుధీర్, నాగరాజు, శ్రీకాంత్, రేసు సందీప్, ముక్తి ఫణిందర్, నాగప్రసాద్, నరేష్‌బాబు, కృష్ణవేణి ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బోనకల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని తెలంగాణ జన సమితి పార్టీ (టీజేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు అన్నారు. బోనకల్‌లో టీజేఎస్ మండల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యమకారులకు ఇచ్చిన హామీ ప్రకారం స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయాలన్నారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ సర్దార్ హుస్సేన్, కార్యదర్శి బట్టు రాజేందర్ నాయక్, మండల అధ్యక్షుడు బీరెల్లి వాసు, కార్యదర్శి తాళ్లూరి శ్రీనివాసరావు, నాయకులు బీరెల్లి కృష్ణ, గూడా రంగయ్య శాస్త్రి, పాల్గొన్నారు.

చర్చించుకుందాం రండి..

సత్తుపల్లి: లారీ యజమానుల సమస్యలపై చర్చించుకునేందుకు యూనియన్ సమావేశం ఏర్పాటు చేయాలని లారీ యజమానుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. 'సాక్షి'లో నాలుగురోజుల నుంచి వస్తున్న వరుస కథనాలపై లారీ యజమానుల్లో కదలిక వచ్చింది. లోకల్, నాన్‌లోకల్ లోడింగ్‌తో శ్రమదోపిడీ చేస్తున్నారని.. దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చి సింగరేణి అధికారులతో ఒప్పందం చేసుకునేలా కార్యాచరణ రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందని లారీ యజమానుల గ్రూపుల్లో సాక్షి కథనాలను ఉదాహరిస్తూ చర్చించుకుంటున్నారు. ఆదివారం యజమానులు సమావేశం కావాల్సిందిగా వాట్సాప్‌లో సందేశాలను పంపిస్తున్నారు.

తలరాత తల్లకిందులు..

నిన్నటి వరకు లారీల యజమానులు ఇప్పుడు డ్రైవర్లుగా జీవనం కొనసాగిస్తుండటం వారి తలరాతలు తల్లకిందులైనట్లైందని వాపోతున్నారు. సత్తుపల్లి–కాకినాడ పోర్టుకు బొగ్గు రవాణాను నమ్ముకుని పెద్దసంఖ్యలో లారీలను కొనుగోలు చేశారు. ఏడాది క్రితం వరకు లోడింగ్ సమస్య లేకుండా నెలలో 15 నుంచి 20 కిరాయిలు తిప్పుతూ జీవనం సాఫీగా సాగిపోయేది. ప్రస్తుతం కాకినాడ బొగ్గు రవాణా నిలిచిపోవడంతో యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. లోడింగ్‌లు లేకపోవడంతో ఫైనాన్సులు చెల్లించలేక లారీలు అప్పగించి డ్రైవర్లుగా పలువురు ఓనర్లు బతుకీడుస్తున్నారు. మరికొంద రైతే ఉన్న ఇళ్లు, పొలాలు అమ్మేసి అప్పులు తీర్చుకుంటున్నారు. వారే రోజురోజుకు దిగజారిపోతుంటే ఏజెంట్లు జల్సాలతో కళ్ల ముందే తిరుగుతున్నారని యజమానులు ఆరోపిస్తున్నారు. 750 లారీల నుంచి మూడు నెలల్లోనే 450 లారీలకు పడిపోయాయంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


సత్తుపల్లి లారీ యూనియన్ కార్యాలయం

ఏజెంట్లు పట్టించుకోరు..

ఫ్యాక్టరీలు దిగుమతి చేసుకునేటప్పుడు బొగ్గు పరీక్షించి ఇది ఆర్డర్ చేసిన బొగ్గు కాదని లారీ దిగుమతి చేసుకునేందుకు నిరాకరిస్తారు. ఆ సమయంలో బొగ్గు నాణ్యతకు ఏ మాత్రం సంబంధం లేని లారీ యజమాని లోడింగ్ చేసిన ఏజెంట్‌కు సమాచారం ఇచ్చినా కనీసం స్పందించకపోవడం ఐదారు రోజులు ఫ్యాక్టరీల వద్దనే పడిగాపులు పడి కిరాయిలో తగ్గించుకొని తిప్పలు పడి అన్‌లోడింగ్ చేసి రావాల్సిన దుస్థితి యజమానులకు అనుభవం ఉంది. దీనిపై ఏజెంట్లను ప్రశ్నిస్తే అప్పుడప్పుడు అలా జరుగుతాయని, పట్టించుకోనట్లు వ్యవహరిస్తారని కిరాయి నష్టంతో పాటు ఖర్చులు పెరుగుతాయని లారీ యజమానులు బాధను వెల్లబుచ్చుతున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని : మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి శ్రీలం సుదర్శన్ రావు, అతడి కుమారుడు చైతన్యపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్ మీరా తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సుదర్శన్‌రావు కుటుంబసభ్యులకు సంబంధించిన భూ వివాదంపై ఈనెల 6న తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. గ్రామానికి చెందిన మాలెంపు కోటేశ్వరరావు, వారి కుటుంబసభ్యులు ఈ వివాదంలో జోక్యం చేసుకోగా ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సుదర్శన్‌రావు, అతడి కుమారుడిపై దాడి చేసిన ఘటనలో కోటేశ్వరరావుతో పాటు విజయ, పద్మావతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వేంసూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రామన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కొత్తపల్లి గోపీకిరణ్(20) భీరపల్లి శివారున ఉన్న పెట్రోల్ బంక్‌లో నుంచి ప్రధాన రహదారిపైకి వస్తుండగా మొద్దులగూడెం వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన గోపీకిరణ్‌ను చికిత్స నిమిత్తం సత్తుపల్లికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

బురదలో దిగబడిన లారీ..

● సీసీ రోడ్డు నగం వేసి వదిలేయడంతో ఘటన

కారేపల్లి: డోర్నకల్ జంక్షన్ నుంచి కారేపల్లి మీదుగా భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ వరకు నిర్వహించే డబ్లింగ్ రైల్వే లైన్ ప్రక్రియలో భాగంగా.. పనులు చేపట్టిన రైల్వే అధికారులు ముందస్తుగా రైల్వే ట్రాక్ సిమెంట్ దిమ్మెలను లారీల్లో ట్రాక్‌ల వెంట స్టోర్ చేస్తున్నారు. కాగా, శనివారం కారేపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే కేబిన్ వద్దకు సిమెంట్ దిమ్మెలను తీసుకొస్తున్న లారీ కారేపల్లి ముత్యాలమ్మగుడి, సంత, సింగరేణి ప్రాథమిక పాఠశాలల కూడలి మీదుగా వెళ్తుండగా దిగబడిపోయింది. టైర్లు మొత్తం బురదలో దిగబడడంతో లారీ పూర్తిగా ఓ పక్కకు వాలిపోయింది. ఇటీవల ముత్యాలమ్మగుడి నుంచి డోర్నకల్ బైపాస్ రోడ్డుకు కలిపేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అది సగం వరకు వచ్చి ఆగిపోవడం, మిగతా రోడ్డులో అప్పటికే మట్టిని తొలగించి ఉండడంతో వరద నీరు చేరింది. ఈ క్రమంలో లారీ దిగబడగా.. క్రేన్ సాయంతో సిమెంట్ దిమ్మెలను దింపి లారీని బయటకు తీశారు.


దిగబడిపోయిన సిమెంట్ దిమ్మెల లోడ్ లారీ